క్లుప్తంగా

18 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



పెనమలూరు: మండల పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న 18 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే బోడెప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకిలో శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 18 మందికి రూ.11.36 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో సీఎంఆర్‌ఎఫ్ రూ.6.43 కోట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కోయా ఆనంద్ ప్రసాద్, నేతలు సంగెపు రంగారావు, అబ్దుల్‌గౌస్, కొమ్మినేని శ్రీనివాసరావు, మాబుసుభాని పాల్గొన్నారు.

కంపాక్టర్ బిన్స్‌ని పెంచాలి



పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగరంలో వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కంపాక్టర్ బిన్స్ సంఖ్యను మరింత పెంచాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, ఎర్రమేడ రోడ్డు, బోయపాటి మాధవరావు వీధి, క్రీస్తురాజుపురం, డెంటల్ కాలేజ్ రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ సర్వీస్ రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డు, నరసరాజు రోడ్డు, అయోధ్య నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కంపాక్టర్ బిన్స్‌ని ఎక్కువగా ఏర్పాటుచేసి వ్యర్థాలు రోడ్డుపైన పడకుండా చూసుకునే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వ్యర్థాలు తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని కోరారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పాలని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని



పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. 64వ డివిజన్ ఎన్ఎస్‌సీ బోస్‌నగర్లో శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలను వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కూలర్లు, ఫ్రిజ్‌లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. అలాంటి చోట్ల దోమలు గుడ్లు పెట్టే అవకాశముంటుందని పేర్కొన్నారు. దీని వల్ల డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాలు వచ్చే వీలుంటుందని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని, దోమల పెరుగుదల నిర్మూలనకు కృషి చేస్తామని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మెడికల్ అధికారి డాక్టర్ నిహారిక, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు, మలేరియా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రూ.26 వేలు జీతం ఇవ్వాలి

వీఎంవీయూ ప్రధాన కార్యదర్శి బుద్ద రాజా

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలకు తగ్గకుండా జీతాలు ఇవ్వాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్ద రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం 55వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యవసరాలను చెల్లించుకోవాలంటే జీతాల మీద ఆధారపడి జీవించే పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస వేతనం అమలు చేయకపోడం దుర్మార్గమన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. టేనర్‌పేట కొండ ప్రాంతంలో షేక్ హేమలత, చాన్‌బాషా కుటుంబం నివాసం ఉంటుంది. వీరిద్దరిది ప్రేమ వివాహం కాగా, ఒక బాబు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే చాన్‌బాషా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి వెళ్లి కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రక్షిత పథకానికి మోక్షమెప్పుడో?

- రూ.1.17 కోట్లతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతం పనులు పూర్తి
- ముగింపు పనులు పూర్తి చేయని కూటమి సర్కార్
- ఇబ్బందులు పడుతున్న గొడవర్రు వాసులు

కంకిపాడు: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో!. చెంతనే రక్షిత మంచినీటి పథకం నిర్మాణం పూర్తయినా అలంకారప్రాయంగా మిగిలింది. ఒకే ఒక్క రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి అవసరాలు అరకొరగా తీరుతున్నాయి. తాగునీరు సమృద్ధిగా అందక అవస్థలు పడాల్సిన దుస్థితి గొడవర్రు గ్రామంలో నెలకొంది. లక్షలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఎప్పుడు ప్రారంభిస్తారో? అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు.



గొడవర్రులో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

రూ.1.17 కోట్లతో నిర్మాణం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల తాగునీటి అవసరాలు సమృద్ధిగా తీర్చాలనే ప్రణాళికతో రూ.1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ.1.17 కోట్ల అంచనా వ్యయంతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పైపులైన్ల విస్తరణ, రెండు నీటి బోర్లు ఏర్పాటు పూర్తి చేశారు. గ్రామంలో అక్కడక్కడా మాత్రమే పైపులైన్ల కనెక్షన్ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు పాలక వర్గ ప్రతినిధులు చెబుతున్నారు.

ఒకే వాటర్ ట్యాంకు ఆధారం..

ప్రస్తుతం గ్రామంలో ఒకే ఒక్క వాటర్ ట్యాంకు అందుబాటులో ఉంది. ఎస్టీ కాలనీలో ఉన్న 40 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. మరో వైపు డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు ప్రజలకు అందుతుంది. భూగర్భజల మట్టం తగ్గుతుండటంతో తరచూ తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకం పనులు 95 శాతం పైగా పూర్తయ్యాయి. చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేయటంలో కూటమి సర్కారు నిర్లక్ష్యం వహిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోతున్నా ఇప్పటి వరకూ పెండింగ్ పనులపై దృష్టి పెట్టడం లేదు. తుదిదశ పనులు పూర్తయితే లక్షలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకం అందుబాటులోకి వస్తుందని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. తాగునీటి అవసరాలు తీరుతాయని ఆశతో ఉన్నారు.



అందుబాటులో ఉన్న రెండు బోర్లు

మైనరు పనులు పూర్తి చేయాలి



రూ.1.17 కోట్లతో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. మైనరు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి పూర్తి చేస్తే గ్రామస్తులకు సమృద్ధిగా తాగునీరు అందుతుంది. అడపాదడపా భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు పథకాన్ని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మేరుగు విజయ చంద్రశేఖర్, సర్పంచ్, గొడవర్రు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఏరియా మొత్తం, మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, స్టేట్ స్కూల్, గొల్లనపల్లి, బీబీ.గూడెం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

పెనమలూరు: కానూరు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం టీచర్స్ కాలనీ, నాగార్జున ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా టీచర్స్‌కాలనీ, 80 అడుగుల రోడ్డు, పంటకాలువ రోడ్డు, బందరు రోడ్డు, వృద్ధుల ఆశ్రమం ప్రాంతం, చలసానినగర్, మైత్రీనగర్, ఎండోమెంట్‌కాలనీ, కామయ్యతోపు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని అన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురులో కూడా శనివారం విద్యుత్ సరఫరా నిలుపుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ హరిబాబు తెలిపారు. ఈ కారణంగా యనమలకుదురు గ్రామం, డొంకరోడ్డు, శ్రీనగర్‌కాలనీ, ఎంపీఆర్ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రధాన గ్రామం, జాతీయరహదారి సమీప ప్రాంతాలు, రామానగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెనమలూరు సెక్షన్ పరిధిలో

పెనమలూరు: పెనమలూరు సెక్షన్‌లోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఈఈ పి.హరిబాబు శుక్రవారం వివరాలు తెలుపుతూ గంగూరు సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు సిబ్బందితో సహకరించాలని అన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

పెనమలూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నామని మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు పెనమలూరు సెంటర్ కిలారు అనిల్ ఎస్టేట్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తితో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని, కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని చాటాలన్నారు.

చినుకుపడితే బస్టాండ్ చెరువే

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ మార్గం లోతట్టులో ఉండటంతో బస్సులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా నిర్మించిన బస్‌స్టేషన్ భవనం నుంచి విజయవాడ రోడ్డును అనుసంధానం చేసే రహదారి నిర్మించకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడింది. పలు అభ్యర్థనల తర్వాత ఎట్టకేలకు లోతట్టులో ఉన్న ఇన్‌గేట్ మార్గాన్ని సీసీ రోడ్డుతో మెరక చేశారు. కానీ అవుట్ గేట్ మార్గాన్ని మాత్రం అలాగే వదిలేశారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా, నీళ్లంతా అవుట్‌గేట్ రోడ్డులో నిల్చిపోయి చెరువును తలపిస్తోంది.



వర్షపు నీటితో చెరువుగా మారిన బస్టాండ్ అవుట్ గేట్ మార్గం

ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం

గన్నవరం రూరల్: ఆరోగ్య సమాజ నిర్మాణం లక్ష్యమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. శుక్రవారం 5వ రోజు కళాశాలలో మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్ సందడిగా కొనసాగింది. నగరంలోని పాఠశాలల విద్యార్థులు 3500 మంది ఎగ్జిబిషన్ సందర్శించారు. 1500 మందికి పైగా ప్రదర్శనకు విచ్చేసి ఆరోగ్య అవగాహన పొందారు. డాక్టర్ భీమేశ్వర్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, నాటు వైద్యాలు పని చేయవని, శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలతో వైద్యం అందాలన్నారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ రాజగోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

డెంటల్ కళాశాలలో..

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో శుక్రవారం 5వ రోజు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో ఎక్స్‌ప్లోర్– 25 ఎగ్జిబిషన్ జరిగింది. 9 విభాగాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను విద్యార్థులు తిలకించారు. ప్రిన్సిపాల్ రామోజీరావు మాట్లాడుతూ అధునాతన క్యాడ్‌క్యామ్ డిజిటల్ మిషన్‌ను రూ.70 లక్షలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంటిని స్కానింగ్ ద్వారా తీసుకుని తయారు చేసి అతి తక్కువ ఖర్చుతో గంటలో అమర్చుతామన్నారు. హెచ్‌వోడీలు కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, వైద్యులు పాల్గొన్నారు.



ఎముకల నిర్మాణాన్ని విద్యార్థులకు వివరిస్తున్న వైద్యులు

తల్లిపాల విశిష్టతను అందరూ తెలుసుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కోలా విజయశేఖర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికా, పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోలా విజయశేఖర్ మాట్లాడుతూ పసిబిడ్డలకు సృష్టిలో తల్లిపాల కన్నా అమృతం మరొకటి లేదన్నారు. తల్లిపాల గురించి ప్రచారం చేయాల్సి రావటం బాధాకరమన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, తమ చుట్టూ ఉన్న సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. మహిళలు దీనిపై అపోహలు వీడాలన్నారు. తల్లిపాలు బిడ్డలకు ఇవ్వటం వలన వారికి సైతం మేలు జరుగుతుందని వివరించారు. లయన్స్ ప్రముఖులు దామర్ల శ్రీశాంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీ హరిప్రసాద్, కార్యదర్శి పీ లక్ష్మీశ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ లయన్స్ ప్రముఖులు దేవతి నాగేశ్వరరావు తదితరులు నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు గ్రామ పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి పూజలు చేశారు. అమ్మవారికి గ్రామ పొంగళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోట్ల శ్రీహరి, శ్రీలక్ష్మి, నర్రా ప్రసాద్, భ్రమరాంబ దంపతుల నేతృత్వంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో భక్తులచే శ్రీలక్ష్మీ సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు సభ్యులు, పరిసరా ప్రాంత భక్తులు హాజరయ్యారు. పలు ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

చినకంచిలో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం చినకంచిలో శ్రావణ శుక్రవారం లక్ష్మీదేవి అమ్మవారికి ముత్తయిదువులు విశేష అలంకారం చేసి వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. పెద్దిబొట్ల ఉమామహేశ్వరం పూజాకార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి కళ పూర్ణిమ కావడంతో చండీహోమం నిర్వహించారు. శ్రీఅష్టలక్ష్మి సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి అభిషేక ఆరాధన అనంతరం స్వామి దర్శనం జరిగింది. ముత్తయిదువులు పూజలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థప్రసాదములు అందజేశారు.



శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పొంగళ్లను తీసుకువస్తున్న భక్తులు



రామవరప్పాడులో కొలువై ఉన్న పేరంటాలమ్మ అమ్మవారు

పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగలి వండి నైవేద్యం సమర్పించారు. వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా ముగ్గురమ్మలకు కుంకుమార్చనతో పాటు శ్రావణమాస విశేష పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో 3వ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీకనకదుర్గ అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదలు అందచేశారు.



యనమలకుదురులో శ్రీకనకదుర్గ అమ్మవారు



నున్న చినకంచిలో లక్ష్మీదేవికి అలంకారం

సౌభాగ్యలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయవాడ కల్చరల్: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం వరలక్ష్మీ పూజ నిర్వహించారు. అర్చక స్వాములు పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ ఆగమ శాస్త్ర ప్రకారం పూజాదికాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సూపరింటెండెట్ ఆర్. మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో టీటీడీ అనుబంధ 60 దేవాలయాల్లో కంకణాలు సౌభాగ్య కిట్‌ను అందజేసినట్లు తెలిపారు.

బీసీలపై దాడులు దుర్మార్గం

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి కొండవీటి

కంకిపాడు: టీడీపీ పాలనలో బీసీలపై దాడులు పెచ్చుమీరాయని, దాడులు దుర్మార్గమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర మాజీ సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీలపై కూటమి పాలనలో సాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. సుబ్బారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లా తొలి మహిళ, జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై ఇటీవల దాడి జరిగిందన్నారు. కుట్రపూరితంగా హతమార్చాలనే, కూటమి బరితెగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. బీసీల పేరుచెప్పుకునే టీడీపీ బీసీలపై దాడులు చేయటం, వాటిని ప్రోత్సహించటం హేయమన్నారు. బీసీ వర్గాన్ని అణగదొక్కాలని చూస్తే సహించేది లేదన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పార్టీ శ్రేణులు పనిచేస్తారన్నారు. దాడులను ప్రతిఘటించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని, కూటమికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

బీజేపీ చేతిలో కీలుబొమ్మగా ఎన్నికల కమిషన్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాని మోదీకీ తొత్తుగా మారిందని, కీలుబొమ్మగా మారి బీజేపీ ఏం చెబితే అదే చేసే విధంగా తయారైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విజయవాడ అలంకార్ సెంటర్ లోని ధర్నా చౌక్ నందు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇది రాజ్యాంగానికే ప్రమాదమని హెచ్చరించారు. దేశ ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–సర్)ను తీసుకొస్తుందన్నారు. బీహార్ రాష్ట్రంలో 15 లక్షల ఓట్లు తొలగించారని, మరో 45 లక్షల ఓట్లు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో మొట్టమొదటిసారిగా ఓటరు తనకు తానే ఓటర్‌ను అని నిరూపించుకునే బాధ్యతను ఓటర్లపైనే పెట్టారని, ఇది అప్రజాస్వామికం, నిరంకుశమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజలకు ఓటు హక్కును నిరాకరించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, దీనిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల అక్రమ తొలగింపు ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు ఆపాలని కోరుతూ నినాదాలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ టీడీపీ ఎంపీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఢిల్లీలో లేఖ ఇవ్వడం జరిగిందని, అంతటితో ఆగకుండా ప్రతిపక్షాలు జరిపే పోరాటంలో కలిసి రావాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తోందన్నారు. సర్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు, వామపక్ష వాదులు ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల ఆందోళనలకు తలొగ్గి ఎన్నికల కమిషన్ తన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ రాజకీయవ్యవస్థను, పార్లమెంటరీ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఉమ్మడి ఉద్యమంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో పావుగా మారిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను నియమించే వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడం, అక్రమాలకు పాల్పడటం చూశామని, ఇకపై ఎన్నికల్లో ఏకంగా ఓట్లు లేకుండా చేయడం చూస్తామన్నారు. సర్ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశమంతటా అమలు కాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, చుక్కపల్లి తిరుమలరావు, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ ఆంజనేయులు డీవీ కృష్ణ, ఆంధ్ర మల్యాద్రి, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బోయి సత్యబాబు, బి.రమణరావు, పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మహనీయుల త్యాగాలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: మహనీయుల త్యాగాలు సదా స్మరణీయని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, శ్రీ కళా భారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా భారత దేశం–నాడు– నేడు అంశంగా సదస్సు, దేశ భక్తి గీతాల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ నేటి భారత దేశం అగ్రదేశాలను సహితం శాసించేస్థితికి చేరుకుందని తెలిపారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నాటి సినిమాల్లో పాటలు యువతను చైతన్య పరిచాయన్నారు.